నమస్తే తెలంగాణ
నాగర్‌కర్నూల్
5 మహబూబ్‌నగర్, మంగళవారం 17 జూన్ 2025 NAGARKURNOOL

- గేట్ల మరమ్మతు పేరుతో రిజర్వాయర్లకు నీటి పంపింగ్ నిలిపివేత
- ప్రశ్నార్థకంగా సాగు
- అధికారుల నిర్లక్ష్యం రైతులకు శాపం
- అవగాహన రాహిత్యం తోనే పంపింగ్‌కు బ్రేక్
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న సంగంబండ, భూత్పూర్ ఆయకట్టు రైతులు


నీరు లేక వెలవెలబోతున్న భూత్పూర్ రిజర్వాయర్

# ఆశలు ఆవిరి

పాలకుల నిర్లక్ష్యం, నీటిపారుదల శాఖ అధికారుల పర్యవేక్షణ లోపంతో అన్నదాతల ఆశలు ఆవిరి అవుతున్నాయి. రిజర్వాయర్ల గేట్లకు వేసవిలో మరమ్మతులు చేయకుండా వానకాలంలో పనులు ప్రారంభించడంతో నీటి పంపింగ్‌కు బ్రేక్ పడింది. దీంతో సాగు సందిగ్ధంలో పడునున్నది. అధికారుల నిర్లక్ష్యం రైతులకు శాపంగా మారే అవకాశం లేకపోలేదు.


– మక్తల్, జూన్ 16

మక్తల్ నియోజకవర్గ ప్రజల కలల స్వప్నమైన టువంటి చిట్టెం నర్సిరెడ్డి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్, భూత్పూర్ రిజర్వాయర్లను వానకాలంలో కృష్ణానదికి వచ్చే వరద నీటితో నింపి నియోజకవర్గంలోని రైతులకు సాగునీరు అందించాలని లక్ష్యంతో రాజీవ్ ఎత్తి పోతల పథకం కింద భీమా ఫేజ్ వన్‌లో నిర్మించారు. మక్తల్ మండలం సంగం బండ పెద్ద వాగుపై చిట్టెం నర్సిరెడ్డి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ను 50శాతానికి పైగా వరద నీరు, 40శాతం కృష్ణా జలాలను ఎత్తిపోసి రిజర్వాయర్‌ను నింపాలనే లక్ష్యంతో నిర్మించారు. చిట్టెం నర్సిరెడ్డి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌ను 3.313 టీఎంసీల సామర్థ్యంతో 64,200 ఎకరాలకు సాగునీరు అందించాలని సంకల్పంతో నిర్మించారు. రిజర్వాయర్ కిందలో లెవెల్ లెఫ్ట్ మెయిన్ కెనాల్ పరిధిలో 59వేల ఎకరాలు, లో లెవెల్ రైట్ మెయిన్ కెనాల్ కింద పదివేల ఎకరాలు, హై లెవెల్ లెఫ్ట్ మెయిన్ కెనాల్ కింద 29,900 ఎకరాలు, హై లెవెల్ రైట్ మెయిన్ కెనాల్ కింద 18,400 ఎకరాలకు రిజర్వాయర్ నుంచి సాగునీరు అందించాలనే లక్ష్యంతో అధికారులు రూపొందించారు.

ప్రతి ఏడాది రిజర్వాయర్ ఎగువ ప్రాంతంలో ఉన్నటువంటి, కర్ణాటక రాష్ట్రం గుర్మిట్కల్ పెద్దవాగు నుంచి వచ్చే వరద తోపాటు కృష్ణానది నుంచి, మక్తల్ మండలం చిన్న గోపులాపూర్ స్టేజ్ వన్ పంప్ హౌస్ నుంచి కృష్ణ వరద నీటిని పంపింగ్ చేసి, మక్తల్‌లోని స్టేజ్ టూ పంప్ హౌస్‌తో చిట్టెం నర్సిరెడ్డి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు గ్రావిటీ కెనాల్ ద్వారా నీటిని నింపే ప్రక్రియను చేపట్టేవారు. మక్తల్ మండలం భూత్పూర్ గ్రామం వద్ద 1.313టీఎంసీల సామర్థ్యంతో భూత్పూర్ రిజర్వాయర్ నిర్మాణం చేపట్టారు. ఈ రిజర్వాయర్ కింద 46,800 ఎకరాలకు సాగు నీరు అందించేందుకు రిజర్వాయర్ రూపకల్పన చేశారు. గత రెండేండ్ల నుంచి రిజర్వాయర్లకు నీటిని నింపే ప్రక్రియను ఇటు నీటిపారుదల శాఖ అధికారులు, అటు పాలకులు పట్టించుకోవడం లేదు. దీంతో అన్న దాతలు అవస్థలు పడుతున్నారు.

చిట్టెం నర్సిరెడ్డి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ 10గేట్లు పూర్తిస్థాయిలో దెబ్బ తిన్నప్పటికీ వాటికి వేసవిలో మరమ్మతులు చేపట్టకుండానే కృష్ణానదికి వచ్చే వరద నీటి నుంచి జలాశయాన్ని నింపడానికి మంత్రి వాకిటి శ్రీహరి జూన్ 6వ తేదీన చిన్న గోపులాపూర్ వద్ద స్టేజి వన్ పంప్ హౌస్ నుంచి పంపింగ్ ప్రారంభించారు.

వర్షాలు బాగా కురిస్తే రిజర్వాయర్‌కు భారీ స్థాయిలో ఎగువ నుంచి వరద వచ్చే అవకాశం ఉందని నీటిపారుదల శాఖ అధికారులు భావించి పంపింగ్ ప్రారంభించిన రెండు రోజులకే పంపింగ్‌ను నిలిపివేసి గేట్ల మరమ్మతు పనులను ప్రారంభించారు. కృష్ణానదికి వరద వస్తున్న సమయంలో 45రోజులు నీటిని ఎత్తిపోసుకొనే అవకాశం ఉన్నప్పటికీ, అధికారుల నిర్లక్ష్యం వల్ల రిజర్వాయర్లకు నీటి పంపింగ్ నిలిపివేసే పరిస్థితి వచ్చిందని నియోజకవర్గంలోని రిజర్వాయర్ ఆయకట్టు రైతులు వాపోతున్నారు. గతనెల 30వ తేదీనే భీమా నదికి భారీ స్థాయిలో వరద రావడం, కృష్ణా నదికి వరద పోటెత్తుతుండడంతో ఈ ఏడాది ముందస్తుగానే రెండు రిజర్వాయర్లకు వరద వచ్చి చేరుతుందని రిజర్వాయర్ ఆయకట్టు రైతులు ఎంతో సంతోషంతో ఉన్నప్పటికీ వారి సంతోషం ఆవిరి అయిపోయిందని వాపోతున్నారు. అధికారుల నిర్లక్ష్యంతోనే రిజర్వాయర్ల గేట్ల మరమ్మతు పనులు ముందస్తుగా చేపట్టకుండా వర్షాకాలంలో చేపడుతుండడం వల్ల రిజర్వాయర్లకు నీటిని నింపుకొనే పరిస్థితి లేకుండా పోయిందని రైతన్నలు వాపోతున్నారు.


మరమ్మతులకు గురైన సంగంబండ రిజర్వాయర్
మరమ్మతులు చేయాల్సిన భూత్పూర్ రిజర్వాయర్ గేటు
పంపింగ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి(ఫైల్)

మక్తల్ మండలంలోని భూత్పూర్ రిజర్వాయర్‌ను పూర్తిస్థాయిలో కృష్ణ వరద జలాలతోనే నింపాల్సి ఉన్నప్పటికీ నీటిపారుదల శాఖ అధికారులు ఇవేవీ పట్టించుకోవడం లేదు. భూత్పూర్ రిజర్వాయర్ కుడి మెయిన్ కెనాల్‌కు నీటిని వదిలే గేట్లు మరమ్మతు చేయాల్సి ఉన్నప్పటికీ అధికారులకు వేసవిలో చేపట్టకుండా నీటి పంపింగ్ ప్రారంభించిన సమయంలో మరమ్మతులు చేపట్టడం ఎంతవరకు సమంజసం అని రైతన్నలు వాపోతున్నారు. భూత్పూర్ రిజర్వాయర్ ఆయకట్టు 46,800ఎకరాల్లో వానకాలం సీజన్‌లో రైతన్నలు పంట సాగు చేసుకోవాలా లేదా అనే ప్రశ్నార్థకంగా మారింది, నీటిపారుదల శాఖపై ఇటు పాలకులు, అటు ఉన్నతాధికారుల పర్యవేక్షణలేక పోవడం వల్లనే రిజర్వాయర్ గేట్ల మరమ్మతులు నోచుకోలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరమ్మతు పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టి రిజర్వాయర్లకు నీటి విడుదల ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని కోరుతున్నారు.

### భూత్పూర్ రిజర్వాయర్‌లో అడుగంటిన నీటిమట్టం

మక్తల్ మండలం భూత్పూర్ గ్రామం వద్ద నిర్మించిన భూత్పూర్ రిజర్వాయర్ కు కృష్ణానది వరద జలాలతోనే నింపాల్సి ఉంది. రిజర్వాయర్ గేటు మరమ్మతు కారణంగా రెండురోజులు మాత్రమే చిన్న గోపులాపూర్ పంప్ హౌస్ నుంచి రిజర్వాయర్‌కు నీటి పంపింగ్ కొనసాగినప్పటికీ మరమ్మతు పేరుతో నీటిపారుదల శాఖ అధికారులు పంపింగ్ బంద్ చేశారు. దీంతో రిజర్వాయర్ ఏమాత్రం నీరు వచ్చి చేరడం లేదు. ప్రస్తుతం భూత్పూర్ రిజర్వాయర్లో 0.01 టీఎంసీ నీరు మాత్రమే ఉందని, త్వరలో ప్రారంభమయ్యే వానకాలం సీజన్‌కు రిజర్వాయర్ నుంచి సాగు నీరు అందుతుందో లేదో అనే అయోమయ పరిస్థితిలో రైతులు మునిగి పోవాల్సిన పరిస్థితి తలెత్తింది.

### 20 రోజుల్లో మరమ్మతులు పూర్తి



గతేడాదిలోనే చిట్టెం నర్సిరెడ్డి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ గేట్ల మరమ్మతు పనులు చేయాల్సి ఉంది. గేట్ల మరమ్మతు చేసే గుత్తేదారు రాష్ట్రమంతా ఒక్కరే ఉండడంతో వారి రాక ఆలస్యమవడంతోనే జూన్ రెండో వారంలో గేట్ల మరమ్మతు పనులను చేపడుతున్నాం. రిజర్వాయర్ ఎగువ ప్రాంతంలో పెద్దవాగు నుంచి భారీ స్థాయిలో వరద వచ్చే అవకాశం ఉంది. ఏ సమయంలోనైనా వరద వస్తే, రిజర్వాయర్ గేట్లు ఎత్తే పరిస్థితి కష్టంగా ఉన్నందువల్లనే, ప్రస్తుతం రిజర్వాయర్ కు కృష్ణా వరద జలాల నుంచి స్టేజ్ వన్, స్టేజ్–2 పంప్ హౌస్‌ల నుంచి పంపింగ్ ప్రారంభించి రెండు రోజులు కొనసాగించాం. మరమ్మతుల కోసం పంపింగ్ నిలిపి వేశాం. ప్రస్తుతం రిజర్వాయర్‌లో ఒక టీఎంసీకి పైగా మీరు నిల్వ ఉన్నది. 20 రోజుల్లో గేట్ల మరమ్మతు పనులు పూర్తిస్థాయిలో యుద్ధప్రాతిపదికన చేపట్టి, గేట్ల మరమ్మతు పనులను పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నాం. మరమ్మత్తు పనులు పూర్తికాగానే రిజర్వాయర్‌కి నీటి పంపింగ్ ప్రారంభించేందుకు చర్యలు చేపడతాం.

– సతీశ్‌కుమార్, డీఈ


కోడ్గల్‌లో ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న మాజీ మంత్రి డాక్టర్ లక్ష్మారెడ్డి

# వైద్య శిబిరం విజయవంతం

- ప్రారంభించిన మాజీ మంత్రి డాక్టర్ లక్ష్మారెడ్డి

జడ్చర్ల టౌన్, జూన్ 16 : మాజీ మంత్రి డాక్టర్ లక్ష్మారెడ్డి సతీమణి శ్వేతారెడ్డి జ్ఞాపకార్థం మహబూబ్‌నగర్ ఎస్వీఎస్ దవా ఖాన సౌజన్యంతో సోమవారం జడ్చర్ల మండలం కోడ్గల్ గ్రామంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని మాజీ మంత్రి డాక్టర్ లక్ష్మారెడ్డి ప్రారంభించి వైద్య పరీక్షలకు వచ్చిన వారితో ఆయన మాట్లాడారు. అనంతరం ఎస్వీఎస్ దవా ఖాన వైద్యులు 450 మందికి వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. అదే విధంగా 16 మంది కంటి శుక్లాలకు సంబంధించి ఎస్వీఎస్ దవాఖానలో ఉచిత సర్జరీకి రెఫర్ చేశారు. అలాగే గంగా పుల్ పీహెచ్‌సీ వైద్యుడు ప్రతాప్ చౌహాన్ వందమందికిపైగా క్షయ సంబంధిత పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీవైస్ చైర్మన్ యాదయ్య, బీఆర్ఎస్ నాయకులు రఘుపతిరెడ్డి, శ్రీకాంత్, ఇంతియాజ్, రాజేందర్‌రెడ్డి, నాగిరెడ్డి, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామకంఠం భూమిని కాపాడాలి


కలెక్టరేట్ వద్ద బైఠాయించి కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న కొత్తతండావాసులు

- కలెక్టరేట్ ఎదుట బైఠాయించిన కొత్తతండావాసులు

జడ్చర్లటౌన్, జూన్16 : జడ్చర్ల మండలంలోని కొత్తతండాలోని గ్రామ కంఠం భూమిని కాపాడాలని కోరుతూ సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట తండావాసులు బైఠాయించారు. కొత్తతండా అభివృద్ధి కోసం కేటాయించిన భూమిని కొందరు ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని వెంటనే అక్రమ దారులపై చర్యలు తీసుకోవాలని తండావాసులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు తండావాసులు తెలిపారు. తండావాసుల విన్నపం మేరకు కలెక్టర్ స్పందించి అక్రమ నిర్మాణాలపై విచారణ జరపాలని, అదే విధంగా గ్రామ కంఠం భూమిని పరిరక్షించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు తండావాసులు తెలిపారు. కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన వారిలో వడిత్య రమేశ్‌నాయక్, ఉమ్లు, భద్రు, వెంకటయ్య, చందర్, పాండు, శంకర్, నారాయణ, మంజునాథ్, లక్ష్మణ్, శ్యాం, రాము, గోపాల్, సుధాకర్, పన్నిబాయి, లచ్చిబాయి, రూప్లిబాయి, మానికిబాయి, దేవిబాయి, జమ్నాబాయి, సక్రీ, ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

### ఎమ్మెల్యే పల్లాకు మాజీ మంత్రి పరామర్శ


జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిని హైదరాబాద్‌లో సోమవారం మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి పరామర్శించారు.

– వనపర్తి టౌన్, జూన్ 16

# ముచ్చటగా ముగ్గురు..

- రైతు నేస్తానికి రైతులే లేరు..
- రైతు భరోసాపై ముందే ఉప్పందించినా స్పందించని రైతులు


కల్వకుర్తి రైతు వేదికలో సీఎం ప్రసంగాన్ని వింటున్న ముచ్చటగా ముగ్గురు

కల్వకుర్తి, జూన్ 16 : వారం రోజులుగా రైతు భరోసా డబ్బులు విడుదల చేస్తామని రాష్ట్ర మంత్రులు ప్రకటనలు ఇచ్చారు. రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా సీఎం రేవంత్ రెడ్డి రైతులతో మమేకమవుతూ రైతుల కష్టసుఖాలు తెలుసుకుంటారు. అదే రోజు రైతు భరోసా డబ్బులను రైతుల ఖాతాల్లోకి మళ్లీస్తారనే వార్తలు జోరందుకున్నాయి. రాష్ట్రంలోని రైతు వేదికల వద్దకు రైతులు పెద్దఎత్తున రావాలని కాన్ఫరెన్స్ ద్వారా సీఎం రైతులతో మాట్లాడుతారంటూ వ్యవసాయాధికారులు సామాజిక మాధ్యమాల ద్వారా జోరుగా ప్రచారం చేశారు. స్థానిక సంస్థలు ఎన్నికలు అతి త్వరలో నిర్వహిస్తాన్నారనే వార్తల నేపథ్యంలో రైతు భరోసాతో రైతులందరూ కాంగ్రెస్ పక్షానే అనుకున్న వారికి భంగపాటు కలిగే పరిస్థితి క్షేత్రస్థాయిలో కనిపిస్తున్నాయి. అందుకు చక్కని ఉదాహరణ.. సోమవారం కల్వకుర్తి మున్సిపాలిటీలో రైతు వేదిక వద్ద నిర్వహించిన రైతు నేస్తం కార్యక్రమం. రైతు నేస్తం కార్యక్రమంలో ముచ్చటగా ముగ్గురే ఉన్నారు. అందులో ఒకరు వ్యవసాయ శాఖకు చెందిన అధికారిణి. అంటే రైతు నేస్తం కార్యక్రమానికి కేవలం ఇద్దరే రైతులు హాజరై సీఎం ప్రసంగాన్ని విన్నారు.

### రైతుల ఖాతాల్లో జమచేస్తామని..

రైతు భరోసా నిధులను రైతుల ఖాతాల్లో జమచేస్తామని ఇద్దరు ముగ్గురు మంత్రులు గత 4, 5రోజుల నుంచి వరుసగా ప్రకటనలు చేస్తున్నా.. రైతుల నుంచి పెద్దగా సంతోషం వ్యక్తం కాలేదు. ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి కూడా రుణమాఫీ, రైతు భరోసాపై ప్రకటనలు మాత్రమే వస్తున్నాయి. ప్రకటనలు కార్యరూపం దాల్చడం లేదనే అసంతృప్తి రైతుల్లో ఉంది. ఇప్పటి వరకు రైతు భరోసా ఒకేసారి పూర్తిస్థాయిలో ఇచ్చారు. అది కూడా 2023 ఎన్నికల కోడ్ వల్ల నిలిచిన రైతుబంధు డబ్బులు అధికారం వచ్చాక రైతుల ఖాతాల్లో జమ చేశారు. ఆ రైతు భరోసాను ఎన్ని ఎకరాల వరకు వేయాలనే అంశంపై క్యాబినెట్ సబ్ కమిటీ వేసి కాలయాపన చేశారు. దీంతో వానకాలం రైతు భరోసా గంగలో కలిసిపోయింది. సాగు చేస్తున్న భూములకు రైతు భరోసా రూ.6వేల చొప్పున ఇస్తామని ప్రకటనలు చేసింది. యాసంగిలో ఎకరాకు రూ.6వేల చొప్పున రైతు భరోస్తా వేస్తామని చెప్పిన ప్రభుత్వం తేదీల మీద తేదీలు, గడువుల మీద గడువులు పెడుతూ చివరకు మూడున్నర ఎకరాల వరకు ఉన్న రైతులకు రైతు భరోసా డబ్బులు వేసింది. ఇందులో మరో తిరకాసు ఏమిటంటే.. పంట మార్పిడి కోసం పడావు ఉంచిన పొలాలకు రైతు భరోసా ఇవ్వలేదు. అలా కాలాయాపనతో యాసంగి గడిచి పోయింది. వానకాలం వచ్చింది. రైతులు పెట్టుబడి డబ్బుల కోసం అరిగోస పడుతూనే అష్టకష్టాలు పడుతున్నారు. ఈ సమయంలో ప్రభుత్వానికి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడింది. స్థానిక సంస్థలకు కేంద్ర ప్రభుత్వం నిధులు నేరుగా వస్తాయి. స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించకపోతే కేంద్ర ప్రభుత్వ నిధులు రావు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి అస్తవ్యస్తమవుతుంది. దీంతో స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాల్సిన ఖచ్చితమైన పరిస్థితి రాష్ట్ర ప్రభుత్వానికి ఏర్పడింది. గ్రామాల్లో ఎక్కువ మొత్తంలో వ్యవసాయంపై ఆధారపడి మనుగడ సాగించేవారు ఉంటారు. రైతు భరోసా ఇవ్వకపోవడం వల్ల రైతుల్లో ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత ఉంది. దీని నుంచి గట్టెక్కడానికి ప్రభుత్వం మళ్లీ రైతు భరోసాను ముందేసుకుంది. ఈ విషయం గ్రామాల్లో స్పష్టంగా అర్థం కావడంతో ప్రభుత్వం రైతు భరోసా గురించి ఐదారు రోజుల నుంచి పదే పదే ప్రకటనలు ఇస్తున్నా.. కాంగ్రెస్ నాయకులు సోషల్ మీడియాలో జోరుగా ప్రచారం చేస్తున్నా రైతుల నుంచి పెద్దగా స్పందన లేదు. వచ్చిప్పుడు వస్తాయి అనే విధంగా రైతులు నిరాసక్తత వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వాన్ని నమ్ముకుని వ్యవసాయం చేస్తే మన్నుపోసి అంబలి కాసుకున్నట్లేనని రైతులు అంటున్నారు. రైతు నేస్తం కార్యక్రమంలో రైతు భరోసా నిధులు విడుదల చేస్తున్నారని జోరుగా ప్రచారం చేసినా.. రైతులు మాత్రం పెద్దగా స్పందించలేదని అర్థమవుతుంది.

### రైతు భరోసా నిధులు యాసంగివా.. వానకాలానివా ?

ప్రభుత్వం విడుదల చేస్తున్న నిధులు యాసంగివా లేదా.వానకాలానికి ఇస్తుందా అని రైతులు అడుగుతున్నారు. ప్రభుత్వం మాత్రం రైతు భరోసా నిధులు గురించి స్పష్టంగా చెప్పడం లేదు. యాసంగిలో మూడున్నర ఎకరాల వరకు రైతు భరోసా నిధులు ఇచ్చారు. మూడున్నర ఎకరాల నుంచి మిగిలిన రైతులకు రైతు భరోసా ఇస్తారా లేదా.. వానకాలం కొత్తగా ఇస్తారా అనే ప్రశ్నలు రైతుల నుంచి వినిపిస్తున్నారు. వానకాలం ఇస్తే యాసంగి రైతు భరోసా నష్టపోవాల్సిందేనా అని రైతులు వాపోతున్నారు.

# అయోమయం..!

- రెన్యువల్‌కాని పలు ప్రైవేట్ కళాశాలలు
- సమీపిస్తున్న ప్రవేశాల ముగింపు
- ఆందోళనలో విద్యార్థులు, తల్లిదండ్రులు


మహబూబ్‌నగర్‌లోని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కార్యాలయం

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, జూన్ 16 : జిల్లాలోని కొన్ని ప్రైవేట్ ఇంటర్ కళాశాలలకు అఫిలియేషన్ రెన్యువల్ కాకపోవడం అయోమయానికి గురిచేస్తోంది. ఇప్పటికే ఆయా కళా శాలలు ముందస్తు ప్రవేశాలు(ఆఫ్‌లైన్‌లో) తీసుకొని ఉండడంతో విద్యార్థుల తోపాటు తల్లిదండ్రుల్లోనూ ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రభుత్వ నిబంధనలు పాటించిన వాటికే అనుమతులు మంజూరు చేయడం.. లేని వాటిని రెన్యువల్ కూడా అవకాశం ఇవ్వడం లేదు. ఈ విద్యా సంవత్సరం ప్రవేశాల ప్రక్రియ ముగింపు దశ దగ్గర పడడంతో వాటికి అనుమతులు వస్తాయా.. రావా..? అనేసందేహాలు వ్యక్తమవుతున్నాయి.

### సక్రమంగా లేకపోవడంతోనేనా..?

కొన్ని ప్రైవేట్ కళా శాలల్లో మౌలిక వసతులు సక్రమంగా లేక పోవడంతోనే వాటి అనుమతుల ప్రక్రియ ఇంకా పురోగతిలోనే ఉందా..? లేకా ఇతర కారణాలు ఉన్నాయా? అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిరభ్యంతర పత్రం (ఎన్‌వోసీ), ఆట స్థలం, గుర్తింపుపత్రం, సరిపడా అధ్యాపకులు, సిబ్బంది, అగ్ని మాపక అనుమతులు, ఫర్నీచర్, ఇతర మౌలిక వసతులు, అద్దె భవనమైతే సంబంధిత పత్రం తప్పనిసరిగా ఉండాలి. ఇది వరకు కొన్ని లేక పోయినా.. ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసింది. కానీ ఈ ఏడాది నిబంధనల పట్ల కఠినతరంగా వ్యవహరిస్తుండడంతో అనుమతుల ప్రక్రియ ఆలస్యమవుతున్నది. ఆయా కళాశాలలు అన్ని సమర్పిస్తేనే అనుమతులు మంజూరు చేస్తుందని అధికారవర్గాలు చెబుతున్నాయి.

### అనుమతులు ఉన్నాయంటూ..

కొన్ని ప్రైవేట్ కళాశాలలు అనుమతుల విషయంలో స్పష్టత కొరవడింది. అనుమతి మంజూరు కాని కళాశాలలు జిల్లా కేంద్రంతో పాటు జడ్చర్ల, మహబూబ్‌నగర్, దేవరకద్ర నియోజకవర్గాల్లో అత్యధికంగా ఉన్నాయి. మరోవైపు కొన్ని ప్రైవేట్ కళా శాలలు తమకు అనుమతి ఉదంటూ పత్రాలు చూపిస్తూ విద్యార్థులను తల్లిదండ్రులను బురిడీ కొట్టించే ప్రయత్నం చేస్తున్నాయి. ప్రభుత్వం ఇంటర్ ప్రవేశాల గడువును ఈ నెల 30వ తేదీ వరకు విధించింది. అప్పటి వరకు కళా శాలలు అనుమతులు తెచ్చుకుంటాయా? లేదా? అనేది అనుమానంగా మారింది. ఒకవేళ అనుమతి వస్తే సరేసరి.. లేదంటే విద్యార్థుల పరిస్థితి అయోమయంలో పడనుంది. అధికారుల పర్యవేక్షణ, ప్రచార లోపం అనుమతి లేని కళా శాలలకు కలిసివస్తోందనే విమర్శలున్నాయి. ఉన్న తాత్కారులు కొలు వుండే చోటే ఆయా కళా శాలలు బహిరంగంగా అనుమతి లేకున్నా ప్రవేశాలకు దర ఖాస్తులు స్వీకరించడం పలు అనుమానాలు తావిస్తోంది. కఠినంగా వ్యవరించడంలో అధికారులు మామూలుగా తీసుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### జిల్లాలో ఇదీ పరిస్థితి..

జిల్లాలో ప్రభుత్వ కళా శాలలు 15 ఉన్నాయి. ప్రైవేట్ జూనియర్ కళా శాలలు 38 ఉన్నాయి. వీటిలో కేవలం 6 కళా శాలలకు మాత్రమే అఫిలియేషన్ ఉన్నది. 21 కళా శాలల దరఖాస్తులు అండర్ ప్రాసెస్‌లో ఉండగా.. వాటిలో చాలా వరకు మిక్స్‌డ్ ఆక్యూపెన్సీలో ఉన్నట్లు సమాచారం. జిల్లాలోని మిడ్జిల్, హన్వాడ, కోయిలకొండ, బాలానగర్ మండలాల తోపాటు మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ఉన్న కొన్ని కళా శాలలు జిల్లావ్యాప్తంగా మొత్తం 11 కళా శాలలు దరఖాస్తులే సమర్పించలేదు. 2024–25 సంవత్సరంలోనూ జిల్లాలోని 9 కళా శాలలకు ఇంటర్ బోర్డు ఒక్కో దానికి రూ.లక్ష చొప్పున మొత్తం రూ. 9 లక్షలు జరి మానా విధించింది.

### నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



ఇంటర్ బోర్డు గుర్తింపు రాకముందే అడ్మిషన్లు తీసుకుంటున్నట్లు తెలిస్తే చర్యలు తప్పవు. ప్రైవేట్ కళాశాలలు నిబంధనల మేరకు వ్యవహరిస్తేనే ప్రభుత్వం అనుమతిస్తుంది. కొన్ని కళా శాలలు అఫిలియేషన్ రెన్యూవల్ కోసం దర ఖాస్తులు సమర్పించాయి. ఈ అంశం ప్రభుత్వ పరిశీలనలో ఉంది. అనుమతులు రాకపోతే ప్రభుత్వ ఆదేశాల మేరకు తదుపరి చర్యలకు ఉపక్రమిస్తాం.

– కౌసర్‌జహాన్, జిల్లా ఇంటర్ విద్యాధికారిణి, మహబూబ్‌నగర్

# జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలి

- రెండేండ్లు కావస్తున్నా ఒక్క నోటిఫికేషన్ వేయలే..
- జిల్లా కేంద్రంలో ర్యాలీ చేపట్టిన పాలమూరు నిరుద్యోగులు


పాలమూరులో నిరసన ర్యాలీ చేపట్టిన నిరుద్యోగులు

మహబూబ్‌నగర్, జూన్ 16 : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు జాబ్‌క్యాలెండర్ పేరుతో ప్రతి ఏడాది రెండు లక్షల ఉద్యోగాలు వేస్తామని ప్రకటించి అధికారంలోకి వచ్చాక రెండేండ్లు కావస్తున్నా ఒక నోటిఫికేషన్ కూడా వేయకుండా మోసం చేశారని నిరుద్యోగులు నిరసన ర్యాలీని పెద్దఎత్తున చేపట్టారు. సోమవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ప్రధాన గ్రంథాలయం నుంచి ఏనుగొండ ప్రధాన రహదారి వరకు పెద్దఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిరుద్యోగుల ఇచ్చిన హామీ మేరకు జాబ్ క్యాలెండర్ వెంటనే విడుదల చేయాలని పాలమూరు నిరుద్యోగులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత కేసీఆర్ ప్రభుత్వం వేసిన ఉద్యోగాలు తప్పా కొత్తగా ఒక నోటిఫికేషన్ కూడా వేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబాలకు దూరంగా ఉంటూ గ్రంథాలయంలో రాత్రి పగలూ తేడా లేకుండా 24గంటలు చదువుతున్నా ఉద్యోగ నోటిఫికేషన్ వేయకపోవడంతో తీవ్ర నిరాశ చెందుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వం విడుదల చేసిన జాబ్ క్యాలెండర్ ప్రకారం నోటిఫికేషన్లు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. గ్రామపంచాయతీ ఎన్నికలు ప్రారంభమైతే మళ్లీ ఏడాది పడుతుందని ముందుగా నిరుద్యోగులు హామీ మేరకు జాబ్ క్యాలెండర్ వేయాలని కోరారు. ఈనెల 20వ తేదీన హైదరాబాద్‌లోని ఇందిరా పార్కువద్ద నిరుద్యోగులు, విద్యార్థుల పిలుపు మేరకు మహాగర్జన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ర్యాలీలో నిరుద్యోగులు అశోక్, ప్రత్యూష, వెంకటేశ్, దామోదర్, హర్ష, బాలరాజు, నరేశ్, సాయికృష్ణ పాల్గొన్నారు.